౫

# గాజులు

---

**గంగ** గుండెల్లోని ఆశల్లాగే, అందంగా, ఆకర్షణీయంగా వున్న గాజుల్ని ఒకో రకం విడదీసి అట్ట పెట్టెల్లో సర్దుతూంది. సన్నజాజుల్లా సన్నగా, నాజూగ్గా వున్న ఆమె వ్రేళ్ళనుండి దృష్టిని ముఖంమీదికి మరల్చితే తెలుపు, పసుపు కలిసిన రంగు, స్వచ్ఛంగా, అమాయకంగా వున్న కళ్ళు, ఆ కళ్ళలోని కాంతి, కలలు, సొగసైన ముక్కు, రోజా రంగు పెదాలు, ముత్యాల సౌరుల్లాంటి పలువరస, నవ్వితే ఎంతటివారి గుండెల్ని ఝల్లుమనిపించగల ఆకర్షణ గంగలో వున్నాయి. లేచి అట్ట పెట్టెల్ని పేకేజీ చెక్కల్తో చేసిన షెల్ఫ్‌లో పెడుతూంది.

తన కోసమని ప్రత్యేకంగా తెచ్చుకున్న గాజుల్ని రెండు చేతులకి తొడుక్కుని, చేతుల్ని అటూ ఇటూ తిప్పి, వాటి మెరుపులకు, గల గల స్వరాలకు పులకించిపోయింది గంగ. వాటి మధుర మంజులమైన సవ్వడిలో ఆమెకు మంగళ తూర్యారావాలు, గుడిగంటల చప్పుళ్ళు వినిపించాయి. వాటి మెరుపుల్లో రంగడి ముఖం అస్పష్టంగా కనిపించి సిగ్గుపడిపోయింది. "వచ్చే వైశాఖంలో ప్రేమసూత్రంతో మూడుముళ్ళు వేసి, మల్లెల తలంబ్రాలు పోసి కోరికలపారాణి పూసి, ఆశలపల్లకిలో ఊరేగిస్తా నన్నాడు." "మన పెళ్ళికి కోయిలలు పాటలు పాడతాయి. నెమళ్ళు నాట్యం చేస్తాయి, నక్షత్రాలు అమృతాక్షతలు చల్లుతాయి. చిరుగాలి మంత్రాలు చదువుతుంది. వెన్నెల పందిరి వేస్తుంది. నీ నవ్వులు విందులు చేస్తాయి." అన్నాడు. పూర్తిగా అర్థం కాకపోయినా అవన్నీ గుర్తొచ్చి గంగ మేను గగుర్పొడిచింది.

నెమ్మదిగా ఒక్కొక్కగాజు తీసి పెట్టెలో పెడుతూంది. యిప్పుడే వేసుకుంటే మాసిపోతాయి. చిట్లిపోతాయి. రేపు పెళ్ళనగా కమ్మని సంగీతంలాంటి రంగడి మాటల్ని వింటూ, ముందుకు చాచిన తన చేతులకి అతను అందమైన యీ గాజుల్ని తొడుగుతూ వుంటే ఎంత బావుంటుంది. '.

"గంగా !" ఆ పిలుపు గంగని సుందర స్వప్నాల్లోనుంచి వాస్తవంలోకి విసిరేసింది.

"ఏంటే పిల్లా అట్టా ఉన్నావు ? మా రంగడ్ని తల్చుకుని కలలు గంటన్నావా ?" మేనత్త గంగని మేలమాడింది.

"పో అత్తా!" అందంగా సిగ్గుపడింది గంగ.

"అంత సిగ్గెందుకే గంగా? అయ్యయ్యో! ఆ బుగ్గలేంటే అంతెర్ర బడ్డాయి." మేనత్త మాటలకి మరీ సిగ్గుపడిపోయి ఆ ఎరుపు తుడుచుకుంటే పోతుందన్నట్లుగా పయటిచెంగుతో బుగ్గల్ని గట్టిగా తుడుచుకుంది.

"గుండెల్లో మమకారం, బుగ్గల్లో ఎరుపు తుడుచుకుంటే పోతాయంటే ఎర్రిదానా?" గంగ తన సిగ్గునీ, తత్తరపాటునీ కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తూ మౌనంగా గాజుల్ని పెట్టెలో పెడుతూంది. గంగ మేనత్త సత్తెమ్మ శివరాత్రి సంబరం కోసం అలంకరిస్తున్న చుట్టుప్రక్కల షాపుల్ని చూస్తూంది.

"అత్తా రాజమండ్రి వెళ్ళి కొత్తరకం గాజులెత్తాను. చూస్తావా?" ఉత్సాహంగా అడిగింది గంగ.

"చూపించే" సత్తెమ్మ పరధ్యానంగా జవాబిచ్చింది. రంగు రంగుల రక రకాల గాజుల్ని చూపించింది గంగ.

"అత్తా! నీ చేతులకి నాలుగు గాజులేత్తాను. నీ చేతులిట్టా యియ్యి" పచ్చగాజుల్ని, ఎర్రగాజుల్ని అత్తచేతికి తొడుగుతూ ఆలోచనల్లో మునిగిపోయింది గంగ.

తండ్రి గోపన్న మంచాన పడ్డాక యీ నాలుగేళ్ళ నుండి గాజుల వ్యాపారాన్ని గంగే చూస్తూంది. గంగ వ్యాపారం చూసుకోవడం మొదలు పెట్టాక కాస్త రెండుపూటలా కడుపు నింపుకోగలుగుతున్నారు. కడుపు నిండడం మొదలు పెట్టాక గంగ చిన్ని గుండెలో ఒక కోరిక మొలకెత్తి

అది క్రమేపీ మహావృక్ష మయింది. రంగడి తలమీద తను తలంబ్రాలు పోసేటప్పటికి జిగ్‌జిగ్ మనే గాజులు ఆ చేతికో డజను, ఈ చేతికో డజను వేసుకుని, వాటికిరువైపులా మిలమిలలాడే బంగారుగాజు లేసు కోవాలి. గంగ కోరిక తెలుసుకున్న రంగడు తనకొచ్చే కొద్దిపాటి జీతాన్ని జాగ్రత్తగా మిగిల్చి పెళ్ళినాటికి ఒక జత గాజులు చేయిస్తానన్నాడు. మరో జత తను చేయించుకోవాలి. అందుకోసం కడుపు కట్టుకుని పైసా పైసా కూడబెట్టి ఆ డబ్బుతో ఎన్నోరకాల అందమైన గాజుల్ని కొన్నది. వాటన్నిటిని వేలాదిజనం సందర్శించే శివరాత్రి తీర్థంలో అమ్మి ఆ డబ్బుతో బంగారపు గాజుల్ని చేయించుకోవాలని కలలు కంటూంది. గాజులు కొనుక్కోవడానికొచ్చిన ప్రతి చేతివంక బంగారపు గాజులు వున్నాయో లేవో, వుంటే ఏ డిజైన్ గాజులున్నాయోనని చూస్తూంది.

"గంగా!" అత్త రెండు చేతులకి నాలుగేసి ఎర్రగాజులు, పచ్చ గాజులు తొడిగి తదేకంగా వాటివంక చూస్తున్న గంగ ఉలిక్కిపడింది.

"అత్తా! బావున్నాయా గాజులు?" సంతోషంగా అత్తవంక చూచింది గంగ. "నీ బంగారపు చేతుల్లో తొడిగితే బాగోకేం చేత్తాయే?" మురిపెంగా మేనగోడలివంక చూస్తూ తన చేతుల్ని వున్న గాజుల్ని గల గల లాడించి సంబర పడిపోతున్న గంగ తలను ప్రేమగా నిమిరింది.

"గంగా! నిన్ను సూత్తంటే నువ్వు పుట్టకముందే నేనొక కొడుకుని కంటే నువ్వు నా యింటే కాలుబెట్టే దానివి గందా, కనకమ్మ యిల్లు బదులుగా నా యిల్లే కళకళలాడేది గందా అనుకుంటానే" పిల్లలకు నోచు కోని అత్త గుండెల్లో గూడు కట్టుకున్న బాధ నెరిగిన గంగ అత్తవంక జాలిగా చూచింది.

"అత్తా! పిల్లలకోసం నువ్వు మనూరి సోములారికి మొక్కుకో లేదా?" అమాయకంగా అత్తని అడిగింది గంగ.

'మనూరు సోములార్నా!' పకపకా నవ్వింది సత్తెమ్మ.

"ఒసే గంగా! మనలాంటోళ్ళు చదువు సందెలు లేనాళ్ళు సరే. అంతంత చదువులు చదూకున్న బాబులు, అమ్మలు, అంతంత డబ్బులున్న మారాజులు యీ సోములోరి దరిశెనం జేసుకుంటాని కంత దూరాన్నించి ఎందుకొత్తారో తెలీదు. ఏ బాబో చెప్పినట్టుగా యీ ప్రజలంతా గొర్రె మందలు. యీళ్ళ బుర్రల్లో వుంది మట్టి. లేపోతే ఎపుడన్నా తిండీ తిప్పలు లేనోడు యీ సోములార్లా బలిసుంటాడా? రెండ్రోజులు తిండీ తిప్పల్లేక పోతేనే శోసొచ్చి పడిపోతామే. తోటకూర కాడల్లాగ ఊగులాడతామే?" క్రమేపీ ఆవేశం చోటు చేసుకుంది సత్తెమ్మ స్వరంలో.

"అదేంటత్తా. ఆయన దేవుడు. ఆయన తపస్సు చేత్తాడు కామట్టి ఆయన ఒళ్ళట్టా వుంది. ఆయనకీ మనకీ సాపత్యేమేంటీ?" ఆశ్చర్యంగా అడిగింది గంగ.

"ఛ ఊరుకోయే. ఆయనకీ, మనకీ సాపత్యెం లేదంటావా? నిజమేనే మనం మంచోళ్ళం. మోసం తెలీనోళ్ళం. ఆయనొట్టి బూటకపు సన్నాసి. ఆ సన్నాసికి ఆరతిచ్చి, బజనల్జేసి దేవుడ్నిజేసి ప్రజల్ని మోసం జేసే ఆ పెద్దోళ్ళంతా మరీ దొంగ సన్నాసులు. ఆ దొంగ సన్నాసుల ఆటల్ని సాగనిస్తున్న ప్రభుత్వం వోళ్ళు, చదువుకున్న మూర్ఖులు. మరీ గరానా దొంగలు. యీ దొంగల గుంపు మాయలోపడి ఎర్రెత్తిపోయి పూజల్జేత్తన్నారీ పిచ్చి సన్నాసులంతా." సత్తెమ్మ ధోరణి గంగకు

వింతగా వుంది. "అత్తా! మరి పెద్దోళ్ళంతా ఆయన్ని దేవుడని మొక్కు-తున్నారు గందా!" సందేహంగా అడిగింది గంగ.

"ఒసే గంగా! మన కడుపులుకొట్టి మేడలు కట్టే యీ బాబులు యిలాంటి దొంగ సన్నాసులందరికి గుడులు కట్టి, తీర్థాలు చెయ్యడానికి ముందుకొత్తన్నారంటే, ఊరికే వత్తన్నారనుకుంటున్నావా? లేదే తల్లీ లేదు. ప్రజల్ని ఎంత మూరకంగా తయారుజేత్తే, ఎంత గొర్రెలమందల్ని జేత్తే ఆళ్ళకంత లాబం. పిచ్చి సన్నాసులు బత్తిలోబడి ఆ మైకంలో ఉంటేగాని, మంచీ చెడూ ఆలోచించకుండా వుంటేగాని, ఆళ్ళవని సులబం కాదు" గాజుల్ని సర్దడం సంగతి మరిచిపోయి విభ్రాంతిగా అత్త ముఖం వంక చూస్తూంది గంగ.

"ఇదంతా వున్నోడు లేనోడిని దోపిడీ చేడానికి పన్నే పన్నాగం. చదూకున్నోడు చదూకోనోడిని ఆ చీకటిలోనే వుంచే పెయత్నం".

"అత్తా! నీకియ్యన్నీ ఎవరు చెప్పారు." గంగ ప్రశ్న విని వాస్తవంలోకి వచ్చిన సత్తెమ్మ తన ఆవేశానికి సిగ్గుపడింది.

"అన్నారం కొడుకు 'కోటి' లేడంటే, ఆడు సల్లమాటేళ అన్నాలు తిన్నాక కూచోబెట్టి ఏటేటో చదివి చెప్తా వుంటాడు. ఆలోసిత్తే ఆడు జెప్పేయి నిజమేననిపిత్తాయే." సత్తెమ్మ చెప్తూ వుండగానే పది మంది పెద్ద మనుషులు వచ్చారు.

"ఏయ్ అమ్మాయ్? మొగోళ్ళెవరూ లేరా?" వాళ్ళల్లో ఒకతను అడిగాడు.

"ఎందు కయ్యగారూ? యిది నా కొట్టే." బెదురుగా చూచింది గంగ.

"నీ కొట్టు నిక్కడినించి లేపెయ్యాలి" మొరటుగా చెప్పా డొకతను.

"నా కొట్టుని లేపెయ్యడ మేమిటయ్య గారూ! ఎప్పుడూ నా కొట్టిక్కడే గందా వుండేది. యిప్పుడెందుకు లేపెయ్యాలి?" బాణం వదల బోతున్న వేటగాడి వంక చూస్తున్న లేడిలా వుంది గంగ.

"శివరాత్రినాడు కార్లు నిలపడానికి కొట్లన్నిటినీ ఖాళీజేయిస్తున్నాం. నువ్వూ ఖాళీ జెయ్యాలి."

"అదేంటయ్యగారూ! నా కొట్టుకొచ్చే వాళ్ళకు యిక్కడుంటేనే తెలుస్తుంది. యిప్పుడు అర్ధంతరాన కొట్టు లేపేయమంటే నేనెక్కడబెట్టు కోను? బాబ్బాబు. మీకు పుణ్ణెముంటుంది. నన్నొదిలెయ్యండి" అంది గంగ బేలగా చూస్తూ.

"ఏంటీ? చెప్తూంటే నీక్కాదూ? నోరు మూసుకుని చెప్పినట్టిను" కర్కశంగా ఆజ్ఞాపించా డొకతను. దాంతో గంగకు తిక్క రేగింది.

"నేనసలు తియ్యను. ఎవడి కార్లో నిలపడానికి మా యాపారం పోగొట్టుకోవాల్నా?" అంది గంగ మొండిగా.

"ఏయ్! చూడ్డాని కమాయకంగా వున్నావు గానీ ప్లీడరు లాగా వాది స్తున్నావే?" మరో అసామీ హేళనగా చూశాడు.

"ఎవడి కారులో నిలపడానికా? ఏంటా పొగరు?" అన్నాడు మరొ కతను.

"అబ్బే, పొగరు కాదండీ! అదొట్టి ఎర్రి బాగుల్ది" ఆ ఊరతను మిగతా బయటి ఊళ్ళ ట్రస్టీల తాలూకు మనుషులకు సర్దిచెప్పటానికి ప్రయత్నించాడు.

"తియ్ తియ్. గాజులన్నీ సర్ది నెత్తి నెట్టుకో. మర్యాదగా చెప్తాంటే విను" అదిలించా డొకతను.

"ఏంటయ్యగారూ? యిందాకట నుండి సూత్తన్నాను మీ పెద్ద మనుషుల వొరస. ఆడపిల్ల గందా, ఎనక మగదిక్కు లేని అక్కు పచ్చి గందా అని కనికరమయినా లేకుండా అట్టా పశువుని చీత్కారం జేస్తన్నట్టు జేత్తన్నారేంటి!" సత్తెమ్మ ముందుకొచ్చింది.

"యీ సత్తరకా యెవత్తి" ఒక బలిసిన మనిషి జోకేశాడు. మిగిలిన వాళ్ళంతా ఆ హాస్యానికి పకపక నవ్వారు. ఆ నవ్వులకి సత్తెమ్మ వంటికి కారం రాసుకున్నట్టయింది.

"ఏటీ, నేను సత్తరకాయనా? అవును. నాకూ డబ్బుతో కొవ్వెక్కితే నేనూ పెద్ద మనిషిలాగా కనిపిద్దును" పెద్ద మనుషులంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారో క్షణం. సత్తెమ్మ మాటలు వాళ్ళ అహం మీద పెద్ద దెబ్బ కొట్టాయి.

"నువ్వెవత్తివే అసలు?" ఒక బుంగ మీసాలతను క్రూరంగా సత్తెమ్మ వంక చూశాడు. సత్తెమ్మ హృదయం భగభగ లాడింది. తీవ్రమయిన అవమానం సత్తెమ్మ నరనరాన్నీ వణికించింది. తరతరాలుగా నివురు కప్పబడిన అగ్నిపర్వతం ఒక్కసారి బ్రద్దలయింది. కళ్ళు చింత నిప్పుల్లాగా అయ్యాయి. పళ్ళు పట పట లాడాయి. గుప్పిళ్ళు బిగుసుకున్నాయి.

"ఒళ్ళు దగ్గిరబెట్టుకుని మాట్లాడుకాత్త. నువ్విచ్చే కోకలకోసం నగలకోసం, పాపిట్టి తిండికోసం నీ పెంపుడుకుక్క కంటే కనాకట్టంగా నువ్వెన్ని తిట్టినా నీకాళ్ళకాడ పడుండే నీ పెళ్ళాన్ని కాదు నేను. ఎవత్తివే

అంటే నువ్వెవడివి అంటాను జాగర్త" బంగ మీసాలకి తల తీసేసి నట్లయింది.

"నీకు డబ్బుంటే నీకు గొప్ప. నాకేంగొప్ప" మళ్ళీ అందుకుంది సత్తెమ్మ.

"ఏం కూశావే?" రంకెలేస్తూ సత్తెమ్మ మీది కొచ్చాడు.

"ఏహె, ఆగవయ్యా! పెద్ద మొగోడివి బయల్దేరావు" పురుగును విదిలించేసినట్లు విదిలించేసింది సత్తెమ్మ. మిగతావాళ్ళంతా సెగలు పొగలు గక్కుతూ సత్తెమ్మ వంక చూస్తున్నారు గంగ ప్రాణాలర చేతిలో పెట్టుకుని చూస్తూంది.

"అత్తా!" సత్తెమ్మను వారించబోయింది గంగ. అంతలో మీసాలు సత్తెమ్మ మీదకు రానే వచ్చాడు.

"నీ పొగరణిగిస్తా చూడు" సన్నగా, శలాకలా వున్న సత్తెమ్మ మెరుపులా పక్కకు తప్పుకుని తనమీదికి వచ్చిన మీసాలు చెంప చెళ్ళు మనిపించింది.

నలుగురు మనుషులు పట్టి ఆపినా వినకుండా సత్తెమ్మ మీదకు మదగజంలా లంఘిస్తున్నాడు మీసాలు. సత్తెమ్మ చేత్తో చేసే యుద్ధం తక్కువయినా నోటితోబాగా యుద్ధం చేస్తూంది. అప్పటికే చుట్టుప్రక్కల షాపులవాళ్ళు, దారినపోయేవాళ్ళు ప్రోగుపడిపోయి రెండు వర్గాలుగా విడిపోయి బలాబలాలు తేల్చేసుకోవాలనే ఊపులోకి వచ్చేశారు.

గంగ పాలిపోయిన ముఖంతో తన పెళ్ళి గాజుల్ని అపురూపంగా గుండెలకు హత్తుకుని ప్రతిమలా నిలబడింది. కనురెప్పపాటులో ఆ ప్రదేశమంతా కేకలతో, తిట్లతో, రణరంగంగా మారి ఒకరి మీద కొకరు ఆవేశంగా దూకుతున్నారు. సత్తెమ్మ గబగబా గంగ దగ్గరి కొచ్చింది.

"గంగా! యీ ముదనష్టపోళ్ళు యింతకి తెగిత్తారనుకోలేదే. కొట్టు మీదపడి చత్తారో ఏంటో" అంటూనే వుంది సత్తెమ్మ. బుంగ మీసాలు అతని సహచరులు సత్తెమ్మను వెంబడించి కొట్లోకెక్కి చెక్కల షెల్ఫుల్ని ఒక్కతోపు తోశారు. వెయ్యి గాజు కొండ లొక్కసారి పగిలినట్లు గాజు లన్నీ ముక్క లయ్యాయి. ఒకడు గంగ జబ్బపుచ్చుకుని లాగడంతో గంగ చేతుల్లో వున్న గాజులు క్రిందికి దొర్లి పగిలిపోయాయి. ఆ గాజుల గుట్ట చూశాక కాని వాళ్ళ ఆవేశాలు చల్లార లేదు. చెదిరిపోయినవాళ్ళు చెదిరి పోగా మిగిలినవాళ్ళు చలనం లేనట్లు గంగ వంక, పగిలిపోయిన గాజుల వంక చూస్తున్నారు.

సత్తెమ్మ ఆ గుట్ట దగ్గర కుప్పలా కూలిపోయింది.

"గంగా! నీ కట్టార్జితాన్నంతా పొట్టన బెట్టుకున్నారే యీ దొంగ చచ్చినాళ్ళు. పెద్దోళ్ళ కాపులు నిలపటానికొచ్చి నీ నోటికాడి కూడు దుమ్ములో గలిపారే తల్లీ! గంగా! యిదంతా నా మూలాన్నే జరిగిందని తిట్టకే. నిన్ను పేడపురుగుకంటే ఈనంగా జూత్తంటే నా కడుపు మండి పోయిందే. నీ కన్నాయం జేత్తంటే చూడలేక నోరిప్పానే. ఇంత పని జరుగుతుందనుకోలేదే అమ్మా! గంగా! పైనున్న దేవుడు, వూళ్ళోవున్న సోములారు నీకు జరిగిన అన్నాయాన్ని సరిజేత్తారంటే? బుగ్గిలో గలిసి పోయిన నీ సొమ్ము నీ కిప్పిత్తారంటే?" హృదయవిదారకంగా ఏడు స్తూంది సత్తెమ్మ.

ముక్కలు ముక్కలైన తన పెళ్ళిగాజుల్ని పదిలంగా దోసిట్లోకి తీసుకుని రెప్ప వెయ్యకుండా చూస్తూంది గంగ. గంగ కళ్ళనుండి ఒక్కొక్క నీటిబిందువు రక్తపు చుక్కల్లాగా గాజు ముక్కల మీదకు రాలుతున్నాయి.